


ఈ రోజుల్లో, యింగ్లీషు మీడియమ్ స్కూళ్ళలో, చిన్నక్లాసుల్లో కూడా సీటు సంపాదించడమంటే, ఇంద్రపదవి సంపాదించినట్టే.

ఇంతకు ముందు యెవరో కాస్తంత హోదావున్నవాళ్ళే తమ పిల్లల్ని యింగ్లీషు మీడియమ్ స్కూళ్ళలో చదివించేవారు. ఇప్పుడు కాలం మారింది. అన్నింటికీ ప్రజాస్వామ్యంగా। మానవులంతా ఒకటే అయితే, ప్రత్యేకించి హోదాగల వ్యక్తులకే ఆ అవకాశం యెందుకు వుండాలి?... అంటున్నారు చాలామంది. అందుకనే యిప్పుడు యింగ్లీషు మీడియమ్ స్కూళ్ళల్లో తమ పిల్లల్ని చదివించాలనుకున్నవాళ్ళే అధిక శాతంలో వున్నారన్నా ఆశ్చర్యం వుండదు. అధవా సీటు దొరక్కపోతే, తప్పనిసరిగా యితర స్కూళ్ళలో

చేరుస్తున్నారు తప్పించి, ప్రయత్నం మాత్రం మొదట యింగ్లీషు మీడియమ్‌కే.

ఈ విషయంలో నాకు అర్థంకానిది ఒకటే; ఇంగ్లీషుని రాజభాషగా రద్దు చేస్తున్నాం అంటూనే ఇంగ్లీషు మీడియమ్ స్కూళ్ళు నడపడానికి అసంఖ్యాకంగా పర్మిషన్లిస్తోన్న ప్రభుత్వ వైఖరి ఏమిటో ఒక పట్టాన బోధపడ్డంలేదు ఆ విధంగా యింగ్లీషుకి మరింత ప్రోత్సహించడమే జరుగుతోంది గాని, గర్హించడం జరగనే లేదు.

ఇంత వుపోద్ఘాతం యెందుకు చెప్పాల్సి వచ్చిందంటే, నా మిత్రుడు మోహన్‌రావు తన కొడుక్కి యింగ్లీషు మీడియమ్ స్కూల్లో కె.జి. క్లాసులో చేర్పడానికి పడిన అవస్థ చూసి, నాకే జాలివేసింది.

మోహన్‌రావు రెండేళ్ళనించీ తన కొడుకుని ఇంగ్లీషు మీడియమ్ స్కూల్లో కె.జి క్లాసులో చేర్పడానికి ప్రయత్నిస్తూనే వున్నాడు... ఎవర్ని పట్టుకున్నా, యెన్ని సిఫారసులు చేయించినా, ఫలితం లేకపోయింది. పట్టువదలని విక్రమార్కుడిలా, యీ యేడాది కూడా పట్టుదలతో ప్రయత్నించాడు. వాళ్ళబ్బాయి బాగానే రాసినట్టు చెబుతున్నాడు. కాని, ఆ స్కూలు హెడ్‌మాష్టారు వి.వి. యమ్. ప్రసాద్, ఆ అబ్బాయి అడ్మిషన్ అర్హత సంపాదించుకునే మార్కులు తెచ్చుకోలేదని నిర్మొహమాటంగా మోహన్‌రావుతో చెప్పాడు.

మోహన్‌రావు డీలాపడ్డాడు. కొడుకు తెలివితేటలమీద అతనికి బాగా నమ్మకం వుంది కాని, హెడ్‌మాష్టారు అలా చెప్పడంతో. అతను నిరుత్సాహపడ్డాడు వాదనలోకి దిగడం మంచిది కాదనుకున్నాడు.

"సార్. రెండేళ్ళు మా అబ్బాయి చదువు వృథా అయ్యిందండీ. వాణ్ణి మీ స్కూల్లో చేర్పించాలనే సంకల్పంతోనే నిరీక్షిస్తూ వచ్చాను. వాడి వయస్సు మించిపోతోంది. ఎలాగయినా, వాణ్ణి యీ సంవత్సరం చేర్చుకోమని అర్థిస్తున్నానండీ," ప్రాధేయపడ్డాడు మోహన్‌రావు.

కాని, అతని అభ్యర్థిన ఫలితాన్నివ్వలేదు హెడ్‌మాష్టారి మనసు కరగలేదు.

"చూడండి మోహన్‌రావుగారూ. మా స్కూలుకి కొన్ని నిబంధనలున్నాయి. ఆ నిబంధనల ననుసరించి, మార్కుల ప్రకారం విద్యార్థుల్ని చేర్చుకుంటాం. మీ వాడికి మేం 'బేస్'గా పెట్టుకున్న మార్కులు రాలేదు. ఏం చేస్తాం చెప్పండి మా రెప్యుటేషన్ని పాడుచేసుకోలేం కదండీ; ఇతర స్కూళ్ళలో యేం జరిగినా, మా స్కూల్లో మాత్రం యెటువంటి అవకతవకలూ జరగడానికి వీల్లేదండీ; అంత పకడ్బందీగా వుంచాము పద్ధతుల్ని...." చెప్పుకుపోయాడు వి.వి. యమ్ ప్రసాద్.

"మరిప్పుడు నన్నేం చెయ్యమం

టారు?"

"అది మీ యిష్టం. నిష్కర్షగా చెబుతున్నానని మరేం అనుకోకండి. మా స్కూల్లో మాత్రం మీ అబ్బాయికి యీ సంవత్సరం అడ్మిషను దొరకదు" ఖచ్చితంగా చెప్పాడతను.

మోహనరావు నిరుత్సాహపూరితంగా యింటిముఖం పట్టాడు. అతని మొహం పాలిపోయింది. తన కొడుకు భవిష్యత్తు రెండేళ్ళు వెనక్కి తీసుకుపోయానే అని మనసులో మధనపడ్డాడు. మరో స్కూల్లో చేర్పించివుంటే బావుండేది... అనుకున్నాడు.

ఆలోచించిన మీదట, ఒక దృఢ నిశ్చయాని కొచ్చాడు. వెంటనే కొడుకుని తెలుగు మీడియమ్ స్కూల్లో చేర్పించేశాడు, మోహనరావు.

సంతృప్తిగా ఓ నిట్టూర్పు విడిచాడు, అడ్మిట్ చేశాక.

*   *   *

ఇటువంటి పరిస్థితే రామిరెడ్డికీ యెదురయ్యింది. వాళ్ళమ్మాయిని యింగ్లీషు మీడియమ్ స్కూల్లో చేర్పించాలని, గత సంవత్సరంనించీ ప్రయత్నించి, విఫలుడవుతున్నాడు. ఈ సంవత్సరం కూడా సీటు దొరకలేదు కె.జి క్లాసులో.

రామిరెడ్డికి, ఆశ్చర్యంతోపాటు ఉక్రోషం పెళ్ళుబికింది.

మోహనరావు మనస్తత్వానికి పూర్తిగా భిన్నమైనది రామిరెడ్డి మనస్తత్వం. విసురుగా హెడ్‌మాస్టారు వి.వి యమ్. ప్రసాద్ రూమ్‌లోకి వెళ్ళాడు.


"మా అమ్మాయికి కె.జి. క్లాసులో సీటివ్వకండా రెండేళ్ళనించీ అన్యాయం చేస్తున్నారు సార్! కారణం యేమిటంటారు?" ప్రశ్నించాడు రామిరెడ్డి.

వి.వి.యమ్. ప్రసాద్, విస్తుపోయి అతనికేసి చూశాడు. తన పర్మిషను లేకుండా యెవ్వరో తన రూమ్‌లోకి రావడానికి సాహసించరు. అటువంటిది రామిరెడ్డి నేరుగా వచ్చేయడం,ఆశ్చర్యమే కలిగించింది మరి. అతనికి మొహంలోని గంభీరత చూసి, సంజాయిషీ అడగలేదు గాని, మోహనరావుకి చెప్పినట్టే సమాధానం చెప్పాడు, హెడ్‌మాస్టారు

కాని, మోహనరావులా వినేసి వెళ్ళిపోలేదు, రామిరెడ్డి.

"మా అమ్మాయికి ట్యూషను పెట్టించానండీ, చాలా బాగా రాసింది కూడాను. ఆమెకి మార్కులు తక్కువయ్యాయంటే నేను నమ్మలేకుండా వున్నాను. కావాలంటే, ఆమె రాసిన పేపరు, మీరు అడ్మిషనిచ్చిన విద్యార్థుల పేపర్లూ తీసి చూడండి... అప్పుడు మీకే అర్థమాతుంది" అన్నాడు, రెడ్డి.

వి.వి.యమ్. ప్రసాద్‌కి, యిటువంటి సమస్య యెప్పుడూ యెదురవ్వలేదు. తాను యేం చెబితే అదే వేదంగా భావించి, అడ్మిషన్లు దొరకనివాళ్ళ




తల్లిదండ్రులు మౌనంగా వెళ్ళిపోయే వారేగాని, ఎదురు ప్రశ్నలు వెయ్య లేదు. ఎదురుగావున్న రామిరెడ్డిని చూస్తే, బొత్తిగా మొరటివాడిలా అగుపించాడ తనికి. అయినా, తాను భయపడకూడ దనుకున్నాడు.

"ఒకసారి ఫలితాలు ప్రకటించిన తర్వాత, ఆన్సరు పుస్తకాన్ని మళ్ళీ తీసి చూసే అలవాటు మాకు లేదండీ. మా స్కూలు చరిత్రలోనే అటువంటి ఆన వాయితీ లేదు. మా టీచర్లుపట్ల మాకు నమ్మకం వుంది. మీరు వెళ్ళొచ్చు." కటువుగానే అన్నాడు.

రామిరెడ్డి, అంత సులువుగా వెళ్ళే మనిషికాదు. కదల్లేదు.

"మీకు మీ టీచర్లంటే నమ్మకం వుండొచ్చు. కాని, నాకులేదు. మా అమ్మాయి తెలివితేటలపై నాకు పూర్తి విశ్వాసముంది. ఆమెకి తప్పకుండా సీటు దొరకాలి." కాస్తంత విసురుగా అన్నాడు రామిరెడ్డి.

వి.వి.యమ్. ప్రసాద్‌కి సహనం పట్టు తప్పుతోంది. అసహనంతో అతని కనుమెమలు ముడిపడ్డాయి. "మీరు అనవసరంగా నా కాలాన్ని వ్యర్థం చేస్తున్నారు. మీరు వెళ్ళకపోతే, మీమీద చర్య తీసుకోవల్సి వస్తుంది." కోపం గానే అన్నాడు హెడ్‌మాష్టరు.

ఆ బెదిరింపుకీ రామిరెడ్డి చెక్కుచెదర లేదు. ఓ దృఢసంకల్పంతో ఆరోజు వచ్చాడుమరి.

"నేను తప్పుచేస్తే, చర్యతీసుకోండి. అందుకు సంసిద్ధమే నేను. ఈ స్వతంత్ర భారతావనిలో ప్రశ్నించే హక్కు అందరికీ వుంది. నేనేం తప్పు అనడం లేదే? మా అమ్మాయి ఆన్సరు పుస్తకాన్ని, మీరు అడ్మిషనిచ్చిన మిగి లిన వారి ఆన్సరు పుస్తకాల్ని రీ చెకింగ్

చెయ్యమని కోరుతున్నాను. లేదా వాళ్ళం దర్నీ పిల్చి ఓరల్ టెస్టు పెట్టండి అప్పుడు మీకే అర్థమవుతుంది, మీ స్కూల్లో అవకతవకలు జరుగుతున్నదీ, లేనిదీను!" ఒక్కముక్కలో చెప్పుకు పోయాడు రామిరెడ్డి.

అప్పటికే కొందరు టీచర్లు, హెడ్ మాష్టారి గదిలోకి వచ్చారు. రామిరెడ్డి అభ్యర్థన మేరకు ఆన్సర్ పుస్తకాలు మళ్ళీ చెక్ చేస్తే, తమ గుట్టు రచ్చకెక్కుతుందేమోనన్న భయం వారిని కలవరపర్చింది.

"సార్, యీయన బెదిరింపులకు మీరు భయపడొద్దు. ఏం చేసుకుంటాడో, చేసుకోమనండి. ఇది మన స్కూలు ప్రిస్టేజి." అన్నాడు వి. వి. యమ్. ప్రసాద్ అనుయాయి, ఆంథోనీ.

రామిరెడ్డికి ఒళ్ళు కంపరమెత్తింది. "ఏం చేస్తానో చూస్తారా? నేరుగా పోయి కోర్టులో కేసు పెడతాను. ఆ ఆన్సరు పుస్తకాల్ని కోర్టులో దాఖలు చేయిస్తాను. వుహూఁ అది మీకు సులువే మిగిలిన వాళ్ళచేత కొత్త అన్సరు పుస్తకాలు రాయించి పెడతారు. అది లాభంలేదు. అంచేత కోర్టులోనే పరీక్ష పెట్టిస్తాను. అప్పుడు తెలుస్తుంది, మీరిక్కడ జరుపుతున్న అన్యాయాలేవిటో! ఎలా మీరు లంచాలు తీసుకుని, వాళ్ళకి మార్కులు ఎక్కువ వేసి అడ్మిషనిస్తున్నారో? అండర్‌స్టాండ్? నన్ను యీ దుస్తుల్లో చూసి, తక్కువ అంచనా వెయ్యకండి. నేను గ్రాడ్యుయేట్‌ని? ఎంత డబ్బయినా ఖర్చుపెడతాను, న్యాయంకోసం. అవసరమయితే, న్యూస్‌పేపరుకి ఎక్కిస్తాను." వుద్రేకంతో అన్నాడు, రామిరెడ్డి.

హెడ్‌మాష్టరు వి.వి.యమ్. ప్రసాదుకి కాస్త వణుకుపుడుతోంది. కాని, ఆంథోనీకి కోపం యినుమడించింది. వీడేం చెయ్యగలడని అనుకున్నాడు గామోసు.

"వెళ్ళవయ్యా: చెప్పినట్టన్నీ చేసినప్పుడు మాటకదా! మవ్వేం చెయ్యగలవ్?" అన్నాడు, నిర్లక్ష్యంగా.

"చూస్తావుకదా నేనేం చెయ్యగలో్నో? డబ్బు రాలిస్తే, యేపనయినా సాధ్యమే! నాకు డబ్బుకి లోటులేదు. మిమ్మల్నం దర్నీ కోర్టుకి లాగుతాను. మీ స్కూలు చరిత్రకి మచ్చపెడతాను." విసురుగా లేచాడు, రామిరెడ్డి.

ఆంథోనీ యేదో అనబోతూంటే, వి.వి.యమ్. ప్రసాద్ చేతి సౌంజ్ఞలో వారించాడు.

వి వి.యమ్. ప్రసాద్ గుండెల్లో నిజంగానే వణుకుపుట్టింది. మొహంపై చిరుచెమట చోటు చేసుకుంటే, జేబులోంచి రుమాలుతీసి తడుచుకున్నాడు. రామిరెడ్డి అన్నట్టే ఒకవేళ జరిగితే, తమ స్కూలు పరువుప్రతిష్టలు రోడ్డున పడతాయి తన టీచర్లలోనే యేదో లోపం వుండొచ్చునన్న శంక కలిగిందతనికి మొట్టమొదటి సారిగా.

"చూడండి మిష్టర్ రామిరెడ్డి. అనవసరంగా ఆవేశపడకండి. మీ కోరిక మేరకు ఆ అన్సరు పుస్తకాల్ని నేను స్వయంగా చూస్తాను. రేపు మీరోసారి రండి..." అన్నాడు

రామిరెడ్డి మనస్సుకి ఆ మాటలు వుపశమనంలా పనిచేశాయి. ఆనందంతో అతని మొహం వికసించింది.

"అలా అన్నారు బావుంది సార్! నాకు కావల్సింది న్యాయం. మీరు న్యాయం తప్పరని నాకు తెలుసు. మీ సహృదయానికి జోహార్లు... వస్తాను సార్..." అంటూ, హీరోలా బయటకి నిష్క్రమించాడు, రామిరెడ్డి.

ఆంథోనీ ప్రభృతులకి ఆ సంఘటన అవమానంలా తోచింది. హెడ్‌మాష్టారు తీసుకున్న నిర్ణయం వారికి నచ్చలేదు.

"ఏమిటి సార్ మీరిలాంటి నిర్ణయాన్ని తీసుకున్నారు?" ప్రశ్నించాడు, ఆంథోనీ.

"ఇదో ఆనవాయితీగా పరిణమిస్తే, చాలా ప్రమాదం సార్! మన స్కూలు ప్రతిష్టకే భంగం..." అన్నాడు మరో టీచరు ఛటర్జీ.

"వాళ్ళమ్మాయి తెలివితేటల మీద యెంతో నమ్మకం లేకపోతే, అతనలా మాట్లాడడు. అందుకే ఓసారి రీచెక్ చేస్తానన్నాను..."

"వొద్దుసార్! అది మన గౌరవానికే గొడ్డలిపెట్టు..." మరో యిద్దరు టీచర్లు ముక్తకంఠంతో చెప్పారు.

వి.వి.యమ్. ప్రసాద్ మాత్రం, తన నిర్ణయాన్ని మార్చుకోదల్చుకోలేదు.

"మన స్కూల్లోని టీచర్లు యెంత నిజాయితీగా వున్నారో, మన స్కూలు ప్రతిష్టని యెలా నిలుపుతున్నారో, నేనూ ఓసారి చూడాలికదా! మనం నిజాయితీగా వున్నపుడు, పేవర్లు రీచెక్ చేస్తే మాత్రం నష్టమేమిటి? అలాగాకుండా, అతను కోర్టులో కేసు వడేశాడే అనుకోండి– అక్కడ తెల్లమొహం వేస్తే, నా పరువేం గాను? నాకు తల తీసేసినట్లైనా మరి! అందుకే ముందు జాగ్రత్త తీసుకుంటున్నాను... మీరు వెళ్ళండి..." అన్నాడు హెడ్‌మాష్టారు.

"ఎప్పుడు చూస్తారు సార్! మా సహాయం కావాలంటే..." అంటూ నసిగాడు, ఆంథోనీ.

"అదంతా మీకు అనవసరం... నాకెవరి సహాయమూ అవసరంలేదు. మీ మీ క్లాసులకి వెళ్ళండి..." గద్దించాడు, వి.వి.యమ్. ప్రసాద్.

ఆ టీచర్లు మొహాలు దించుకుని, వెళ్ళిపోయారు.

వి.వి.యమ్. ప్రసాద్‌కి అర్థమైపోయింది, తమ టీచర్లలో కొందరు యీ సమస్య వుత్పన్నమవ్వడానికి కారకులయ్యుంటారని.

ఆరోజే, తనతోపాటు ఆ అన్సరు పుస్తకాల్ని యింటికి తీసుకుపోయాడు,

వి.వి.యమ్. ప్రసాద్.

*    *    *

మర్నాడు వుదయం తొమ్మిదింటికి వచ్చాడు రామిరెడ్డి హెడ్ మాష్టారు దగ్గరకి

"నమస్కారం సార్...." సవినయంగా అన్నాడు, రామిరెడ్డి.

"నమస్కారం. కూచోండి మిష్టర్ రెడ్డీ" అన్నాడు, వి.వి.యమ్ ప్రసాద్.

"థాంక్స్ సార్..." కూచుంటూ అన్నాడు.

"మీరు చెప్పినట్టు, మీ అమ్మాయి నిజంగా తెలివైనదేనండీ రెడ్డిగారూ! ఆమెకి సీటిస్తున్నాను. పిల్లల చదువు విషయంలో యింత పట్టుదల చూపిన మిమ్మల్ని చూస్తుంటే, నా కెంతో ఆనందంగా వుంది. రేపు మీ అమ్మాయిని తీసుకుని రండి. ఇదిగో, యీ ఫారాన్ని నింపుకుని తీసుకురండి." అంటూ రామిరెడ్డికి ఓ ఫారాన్ని అందించాడు, వి.వి. యమ్. ప్రసాద్.

రామిరెడ్డి మొహం విప్పారింది. పెదాలపై దరహాసం లాస్యమాడింది.

"థాంక్స్ సార్! వస్తా." అంటూ ఎవరెస్టు అధిరోహించి తిరిగి వచ్చిన హీరోలా మొహంపెట్టి, నిష్క్రమించాడు.

దొంగచాటుగా రామిరెడ్డినే గమనిస్తున్న ఆంథోనీ, ఛటర్జీ బృందం, అతని చేతిలోని ఫారాన్ని చూసి దిగాలుపడ్డారు. వారి గుండెలు జోరుగా కొట్టుకున్నాయి ఆ క్షణంలోనే.

రామిరెడ్డి నిష్క్రమణానంతరం, వి.వి.యమ్. ప్రసాద్ భారంగా, ఓ నిట్టూర్పు విడిచాడు. తన టీచర్లలో యెవరెవర్ని యెక్కడుంచాలో, యెవరికే బాధ్యతల్ని అప్పగించాలో, అప్పుడే మనసులో నిర్ణయించుకున్నాడు. అయితే తను టీచర్లు చేసిన ద్రోహంలో మోసపోయిన మోహనరావులాంటి వాళ్ళకి న్యాయాన్ని చేకూర్చలేకపోయాడు. అలా యెంతమందో?... అనుకున్నాడు.

తనకి కనువిప్పు కలిగించిన రామిరెడ్డిని మనసులో అభినందించకుండా వుండలేకపోయాడు, హెడ్ మాష్టరు వి.వి.యమ్. ప్రసాద్.

